ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 29 ఆగస్టు 2025





ఏకదంతాయ.. విభిన్న రూపాయ

● భక్తిశ్రద్ధలతో వినాయకచవితి

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విఘ్నాలు తొలగించే ఆదిదేవుడు.. ఏకదంతుడు.. వినాయకుడు.. విభిన్నరూపాల్లో కొలువుదీరాడు. బుధవారం జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో వినాయకచవితి పూజలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వీధివీధినా మండపాలు ఏర్పాటు చేయగా.. సందడిగా వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్‌రోడ్డులో వెంకటేశ్వరస్వామి అవతారంలో, మేదరవీధిలోని రాధాకృష్ణుల రూపంలో, రైతుబజారు వద్ద వారాహి అమ్మవారి రూపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి.

ఇలిసిపురం రైతుబజార్ వద్ద వారాహి వినాయకుడి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



శ్రీకాకుళం జిల్లాపరిషత్ రోడ్డులో వేంకటేశ్వరస్వామి అవతారంలో వినాయకుడు



శ్రీకాకుళం మేదరవీధిలో కృష్ణుడి రూపంలో కొలువుదీరిన వినాయకుడు



డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రశాంతంగా..

● డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

● తొమ్మిది కమిటీలతో నిర్వహణ ● నేడూ కొనసాగనున్న ప్రక్రియ

అరసవల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. శ్రీకాకుళం మహాలక్ష్మినగర్‌లో సమగ్రశిక్ష ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 543 మంది అభ్యర్థులకుగానూ గురువారం 403 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. జిల్లానలుమూలల నుంచి అభ్యర్థులు ఉదయం 9 గంటలకే హాజరుకాగా 11 గంటలకు ప్రక్రియ ప్రారంభమైంది. అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా అధికారులు (మిగతా 6వ పేజీలో..)



అతిగారాబం వద్దు

● పిల్లల ప్రవర్తనపై కన్నేసి ఉంచాలి
● తప్పటడుగులు వేస్తే.. సరిదిద్దండి
● హర్రర్, క్రైంస్టోరీలకు దూరంగా ఉండాలి
● సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి
● తల్లిదండ్రులకు నిపుణుల సూచనలు

● ఇటీవల హైదరాబాద్‌లో సహస్ర అనే బాలికను పక్కింట్లో ఉన్న పదో తరగతి విద్యార్థి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. క్రికెట్ బ్యాట్ దొంగిలించేందుకు వెళ్లిన ఆ విద్యార్థి.. బాలికను కత్తిపోట్లతో పొడిచి చంపేశాడు. హర్రర్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, సామాజిక మధ్యమాలు మితిమీరి వినియోగించడంతో.. ఆ విద్యార్థి సత్ప్రవర్తన దారి తప్పి.. కిరాతంగా వ్యవహరించినట్టు విచారణలో తేలింది.

● ఉత్తరాఖండ్ ఉదమ్‌నగర్ జిల్లాలో ఇటీవల ఓ విద్యార్థిని టీచర్ చెంపదెబ్బ కొట్టింది. దీంతో ఆ విద్యార్థి లంచ్ బాక్స్‌లో తుపాకీ పెట్టుకుని వెళ్లి.. ఆ టీచర్‌పై కోపంతో కాల్పులు జరిపాడు.

● ఇటీవల నరసన్నపేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ విద్యార్థి.. తరగతిగదిలో ఓ లెక్చరర్‌తో 'డబ్బు సంపాదించాలంటే చదువే ఎందుకు సార్. రీల్స్ చేసి ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పేరు తెచ్చుకుంటే సరిపోతుంద'ని చెప్పాడు. ఈ వ్యాఖ్యలను బట్టి యువతపై సోషల్‌మీడియా ప్రభావం ఎంతమేరకు పడిందో తెలుస్తోంది.

నరసన్నపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):

నేటి తరం పిల్లలు సెల్‌ఫోన్లకు బందీ అవుతున్నారు. వారికి విలువలు నేర్పేవారు కరువై పోతున్నారు. చాలామంది తల్లిదండ్రులు బిజీ జీవితంలో పిల్లల తీరును పట్టించుకోక పోవడంతో.. దారితప్పి నేరాలు, వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. 'మొక్కై వంగనిది.. మానై వంగునా?' అన్న చందంగా చిన్నవయసులోనే పిల్లల ప్రవర్తనపై దృష్టిపెట్టి మార్పు తీసుకురాకపోతే.. వారు పెద్దయిన తర్వాత తీరు మార్చడం కష్టమని నిపుణులు పేర్కొంటున్నారు. పిల్లల తీరుపై కన్నేయాలని, వారు తప్పటడుగులు వేస్తే.. తల్లిదండ్రులే బాధ్యతగా సరిదిద్దాలని స్పష్టం చేస్తున్నారు.

కారణాలెన్నో..

కుటుంబ సమస్యలు, పెద్దల పర్యవేక్షణ లేకపోవడం, అతిగారాబం, చెడు స్నేహాలు, సరైన మార్గదర్శకం లేకపోవడం, పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం తదితర కారణాలతో కొంతమంది పిల్లలు చెడుమార్గంలో పయనిస్తున్నారు. ప్రతీ ఇంట్లో సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ వినియోగం పెరగడంతో పిల్లలు హర్రర్ సినిమాలు, ఇతర షోలను చూస్తున్నారు. ఇవే పిల్లల్లో నేరప్రవత్తికి బీజం పడేలా చేస్తున్నాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అతిగారాబంతో కొందరు తల్లిదండ్రులు.. పిల్లలు ఏం చేసినా సమర్థిస్తుంటారు. తప్పు చేస్తే మందలించక పోవడంతో పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇంకొంతమంది తల్లిదండ్రులు పోటీ ప్రపంచంలో తమ పిల్లలు గెలవాలనే ఉద్దేశంతో మంచి పాఠశాల, మార్కులకు ప్రాధాన్యమిస్తున్నారు. కానీ వారి స్నేహితులెవరు, వారి ఆలోచనలు ఎలా ఉంటున్నాయనేది మాత్రం పట్టించుకోవడం లేదు.

తల్లిదండ్రులదే బాధ్యత..

● పిల్లలతో రోజూ తల్లిదండ్రులు కొంత సమయమైనా కేటాయించాలి. మిత్రులుగా మెలగాలి. సమాజంలో జరిగే తప్పొప్పులు, వాటి ప్రభావాల్ని వివరించాలి. వారి మనసులో ఇతరులు, సమాజంపై ఎలాంటి భావన ఉందో తెలుసుకోవాలి. ఈర్ష్య, అసూయ, కోపం వల్ల అనర్థాలు వివరించాలి. టీవీల్లో, ఫోన్‌లో వారు వేటిని ఆసక్తిగా చూస్తున్నారనేది గమనించాలి. హర్రర్ సినిమాలు, క్రైంస్టోరీలు, రక్తపాతం, భయానక సన్నివేశాలు చూడకుండా జాగ్రత్తలు పాటించాలి. బెదిరించకుండా, కొట్టకుండా నీతికథలు, గొప్ప వ్యక్తుల జీవన విలువల్ని తెలియజేస్తూ మంచిని నేర్పాలి. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి.

● పిల్లలు ఇంట్లో, బయట ఎలా ప్రవర్తిస్తున్నారనేది పసిగట్టాలి. ఎవరినైనా కొడుతున్నా.. జంతువుల్ని హింసిస్తున్నా సంతోషపడటం, ఫైట్లు (మిగతా 6వ పేజీలో..)

స్నేహంగా మెలగాలి

పిల్లలతో తల్లిదండ్రులు ఆచితూచి వ్యవహరించాలి. బాల్యంలో మెదడులో నిక్షిప్తమైన విషయాలను జీవితంలో మర్చిపోవడం జరగదు. ఐదోతరగతి వరకు నీతికథలు బోధించాలి. ఇతరులకు సహాయం చేసే గుణాలను నేర్పించాలి. ఆడపిల్లలు తండ్రితోను, మగపిల్లలు తల్లితో ఎక్కువగా సఖ్యతగా ఉంటారు. వారి అభిప్రాయాలను తెలుసుకుని మంచివాటిని ప్రోత్సహించాలి. పిల్లలకు చెడ్డవాటి ప్రభావం తెలియజేయాలి.

-ఎం.ఆర్.జ్యోతిఫెడరిక్,
రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నరసన్నపేట

పిల్లల ముందు గొడవలు వద్దు

కొన్ని కుటంబాల్లో తల్లిదండ్రులు లేదా అత్తకోడళ్లు పిల్లలు ఉన్నారనే విషయాన్ని గుర్తించకుండా గొడవలు పడతారు. ఇవి పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చిన్న తనం నుంచి ఆట కోసం సెల్‌ఫోన్లు ఇవ్వడం అలవాటు చేస్తున్నారు. వీటిని దూరంగా ఉంచాలి. హర్రర్, క్రైంస్టోరీలు చూస్తూ కలిగే చెడు ఫలితాలను పిల్లలకు తెలియజేయాలి. అప్పటికి పిల్లలు ప్రవర్తనలో మార్పు రాకుంటే మానసిక వైద్యులకు చూపించాలి.

- బెండి సాయిరాం, మానసిక వైద్యుడు,
ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళం



వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఎరువుల కొరత రానీయొద్దు

● అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

కోటబొమ్మాళి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఎరువుల కొరత లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'జిల్లాలో ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. రైతులకు అవసరం మేరకు పూర్తిస్థాయిలో ఎరువులు అందించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం బఫర్ నిల్వగా ఉంచిన 500 మెట్రిక్ టన్నులు కూడా రైతులకు అందించాలి. పంపిణీలో ఇబ్బందులు ఉండకూడదు'ని తెలిపారు. వ్యవసాయశాఖ కమిషనర్‌తో కూడా మంత్రి అచ్చెన్న ఫోన్‌లో మాట్లాడి జిల్లాకు రావాల్సిన ఎరువులు తక్షణమే పంపించాలని ఆదేశించారు. అలాగే మండల పరిధిలో నలుగురు క్షేత్రసహాకులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశారు. విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవశాఖ జేడీ త్రినాథరావు, శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, టీడీపీ నాయకులు వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

తగ్గుతున్న ఆదాయం!

● రిజిస్ట్రేషన్‌శాఖలో పూర్తికాని లక్ష్యం

● ఇంకా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారుల హవా

● తూతూమంత్రపు తనిఖీలతో సరి

ఇచ్ఛాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖలో అడ్డగోలు వ్యవహారాలతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తీసుకొస్తున్నా రిజిస్ట్రేషన్ల శాఖలో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లోనూ అనుకున్నస్థాయిలో ఆదాయం రావడం లేదు. దీనికి కొంతమంది అధికారులు, సిబ్బంది చేతివాటమే కారణమన్న ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొద్దిరోజుల కిందట టెక్కలి సబ్‌రిజిస్ట్రార్‌పై ఈ ఆరోపణలు రుజువు కావడంతోనే సస్పెన్షన్ వేటు పడింది. అయినా ఆ శాఖలో తీరు మారడం లేదు.

● ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్ర కార్యాలయంతోపాటు 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రోజుకు సగటున 300 నుంచి 400 వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అయితే ఆదాయం మెరుగుపరచుకోవడంలో కార్యాలయాలు వెనుకబడ్డాయి. 2023-24లో రూ.24.264 కోట్ల ఆదాయం వస్తుందని భావించగా.. కేవలం రూ.18.124కోట్లు మాత్రమే సమకూరింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూడా అదే పరిస్థితి. రూ.25.59 కోట్లు లక్ష్యంకాగా.. రూ.18.55 కోట్లు ఆదాయం మాత్రమే వచ్చింది. ఏటా లక్ష్యం పెరుగుతోంది తప్ప.. ఆదాయం మాత్రం పెరగడం లేదు. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇంకా దళారుల హవా కొనసాగుతోందన్న విమర్శలున్నాయి. దస్తావేజు లేఖరుల ప్రమేయం అధికమవుతోందని, వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సాధారణంగా భూముల (మిగతా 7వ పేజీలో..)



బుడగట్లపాలెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న మారిటైమ్, సైసఫ్ బృందం

ఫిషింగ్ హార్బర్‌కు స్థల పరిశీలన

ఎచ్చెర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని ఏపీ మారిటైమ్, సెంట్రల్ ఫర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీ(సీఐసీఈఎఫ్) బృందం గురువారం పరిశీలించింది. గతంలో ప్రతిపాదించిన అంచనాల్లో మార్పులు చోటుచేసుకోవడంతో కొత్త ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో ఈ బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ఏపీ మారిటైమ్ బోర్డు ఎస్ఈ డాక్టర్ నగేష్, సీఐసీఈఎఫ్ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్, మత్స్యశాఖ డీడీ వై.సత్యనారాయణ, ఎఫ్‌డీవో రవి, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

క్వాంటం టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం క్యాంపస్‌లో క్వాంటం వ్యాలీ అంతర్గత హ్యాకథాన్‌లో భాగంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లను ఆయన గురువారం పరిశీలించారు. క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్, స్టేట్ విజువలైజర్, సూపర్‌డెన్స్ కోడింగ్ కోడింగ్ ప్రోటోకాల్ తదితర ప్రాజెక్ట్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రాజెక్ట్‌ల (మిగతా 6వ పేజీలో..)




శ్రీకాకుళం కల్చరల్: దండి వీధిలో పంచముఖ వినాయకుడు


శ్రీకాకుళం కల్చరల్: బాలగణపతి


ఇచ్ఛాపురం: ఈదుపురంలో శివలింగానికి అభిషేకిస్తున్న వినాయకుడు


కవిటి: బస్టాండులో జగన్నాథ స్వామిగా..


గార రూరల్: బూరవిల్లిలో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడు


సోంపేట: పెద్దజాలారి వీధిలో వేంకటేశ్వర స్వామి రూపంలో..


కంచిలి: ఏక వింశతీ ముఖ వినాయకుడు

స్వామీ.. వినాయకా!

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండగరోజు ఉదయమే స్వామి దర్శనానికి బారులు తీరారు. మండపాల వద్ద రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకాకుళంతో పాటు పలాస, టెక్కలి, నరసన్నపేట, ఇచ్ఛాపురం ఆమదాలవలస తదితర పట్టణాల్లో వినాయకుడిని విభిన్న రూపాల్లో ప్రతిష్ఠించారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు
- విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనం


కవిటి: బొరివంకలో కదంబపూలతో వినాయకుడు


శ్రీకాకుళం కల్చరల్: రైతుబజార్ వద్ద వారాహి అమ్మవారితో గణనాథుడు




శ్రీకాకుళం కల్చరల్: చల్లావీధిలో ఆపరేషన్ సిందూర్ వినాయకుడు


శ్రీకాకుళం కల్చరల్: వినాయకుడికి పాలిస్తున్న కామధేనువు


శ్రీకాకుళం కల్చరల్: శ్రీశయనవీధిలో గోవర్దన గిరిధారిగా..


ఆమదాలవలస: శ్రీనివాసాచార్యులపేటలో చేనేత కార్మికుని రూపంలో...


టెక్కలి: అయ్యప్పనగర్‌లోని వినాయక మండపం వద్ద దీపాలంకరణ..


పలాస రూరల్: రెంటికోటలో డమరుకం ఆకారంలో సెట్


పలాస: పురుషోత్తపురంలో ఏర్పాటు చేసిన భారీ సెట్


వజ్రపుకొత్తూరు: గరుడభద్రలో ఏర్పాటు చేసిన భారీ సెట్


నరసన్నపేట: తల్లిదండ్రులు పార్వతీ పరమేశ్వర్లును కావడిలో కూర్చోపెట్టి తీసుకుని వెళ్తూ..


మందస: కొత్తవీధిలో భారీ వినాయకుడు


దేవదాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయండి

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలపై నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీ వంద మీటర్లకు తాగునీరు, పాలు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి పెద్ద చెరువు వరకు విద్యుత్ అలంకరణ చేపట్టాలని సూచించారు. అలాగే క్రీడా పోటీలు, వివిధ సాంస్కృతిక, శోభాయాత్ర వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆలయ కార్యనిర్వాహకాధికారి వి.రాధాకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు ప్రసాద్, నాయకులు బోయిన రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా..

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశారు. తొమ్మిది బృందాలుగా ఏర్పడి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఒక్కో టీమ్‌లో ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు, డిప్యూటీ తహసీల్దారు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు. వీరితోపాటు జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సిబ్బంది, పీడీలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి.. గందరగోళం లేకుండా సర్టిఫికెట్లను పరిశీలన చేపట్టారు. సాయంత్రం 4 గంటల వరకు ప్రక్రియ కొనసాగడంతో కొంతమంది అభ్యర్థులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. డీఈవో రవిబాబు నిరంతరం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేశారు. సాంకేతిక సమస్యలున్న అభ్యర్థుల విషయంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారిని ఫోను ద్వారా సంప్రదించి మరీ పరిష్కారాలను సూచించారు. నిబంధనల మేరకు 403 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని, మిగిలిన 140 మంది ధ్రువపత్రాలను శుక్రవారం పరిశీలిస్తామని డీఈవో రవిబాబు తెలిపారు. అభ్యర్థులకు కాల్‌లెటర్స్ కూడా అందజేస్తామన్నారు.

క్వాంటం టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు

(ఐదో పేజీ తరువాయి)

వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. 'రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న హ్యాకథాన్‌లో క్యాంపస్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపాల'ని కలెక్టర్ సూచించారు. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ 'ఈ విద్యాసంవత్సరంలో అండర్ గ్రాడ్యుయేషన్‌లో క్వాంటం టెక్నాలజీని బలోపేతం చేస్తున్నాం. ఇందులో భాగంగా మైనర్ డిగ్రీలో 480 మంది ఎంపిక చేశాం. ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదించాం. జాతీయ రక్షణ, నావిగేషన్, సముద్ర అధ్యయన క్వాంటం సెన్సింగ్ ఫర్ మెరైన్ అప్లికేషన్స్‌ను పరిశోధన, ఆవిష్కరణలకు తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఎప్‌వో వాసు పాల్గొన్నారు.

అతిగారాబం వద్దు

(ఐదో పేజీ తరువాయి)

చేయాలని ఉవ్విళ్లూరడం, పెద్దలని ఎదిరించడం వంటివి ప్రమాద ఘంటికలుగా భావించాలి. బాల్యంలో కుటుంబ వాతావరణం సరిగా లేనివారు. చెడు స్నేహాలు ఉన్నవారు పక్కదారి పడతారు. చిన్న విషయాలకే మందలించడం లేదా ఎంత తప్పు చేసినా వెనుకేసుకురావడం వల్ల చిన్నారుల్లో మంచి,చెడు మధ్య బేధం అర్థం కాదు. సందర్భాన్ని బట్టి సమయోచితంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్పందించాలి. అతి నియంత్రణ కూడా వారిలో క్రూరత్వాన్ని పెంచుతుందన్న విషయం గుర్తుంచుకోవాలి. చిన్నారుల ప్రవర్తనలో ఏదైనా మార్పును ఉంటే ఆదిలోనే గుర్తిస్తే సమస్యను పరిష్కరించుకోవచ్చని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు.

విద్యార్థుల అక్షర నివాళి

టెక్కలి రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బూరగాం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అ,ఆ అక్షరాలుగా ఏర్పడి తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తికి నివాళులర్పించారు. రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్టు హెచ్ఎం పూజారి హరిప్రసన్న తెలిపారు. తెలుగు ఉపాధ్యాయలు రోజా, కోమలి, తదితరులు ఉన్నారు.



జన భాషకు దివిటీ పట్టిన గిడుగు

నేడు తెలుగు భాషా దినోత్సవం

ఎచ్చెర్ల/సరుబుజ్జిలి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు వ్యవహారిక భాష కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు ఆయన. గ్రాంథిక భాషలోని తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోనికి తీసుకువచ్చిన భాషా ఉద్యమ పితామహుడు ఆయన. బడిపంతులు ఉద్యోగమే చేసినా.. ఆయన సాధించినవన్నీ మాటలకందని అద్భుతాలుగా పేర్కొనవచ్చు. ఆయనే సిక్కోలు ఖ్యాతిని, తెలుగు భాష ఔనత్యాన్ని చాటిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు. సరుబుజ్జిలి మండలం పర్వతాలపేటలో ఆయన 1863 ఆగస్టు 29వ తేదీన వెంకమ్మ, వీర్రాజు దంపతులకు జన్మించారు. గిడుగు ప్రాథమిక విద్యాభ్యాసం వారణాసి గున్నయ్య వద్ద సాగింది. విజయనగరంలోని మహారాజా కళాశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. ఆ కళాశాలలో గిడుగు, గురజాడ సహాధ్యాయులే. తెలుగు సాహిత్యంలో గిడుగు రామమూర్తికి ఖ్యాతిని తెచ్చిన అంశాల్లో ఒకటి సవర భాష వికాసానికి చేసిన కృషి , రెండోది వ్యవహారిక భాషా సేవ.

పర్లాకిమిడిలో ఉద్యోగం

మెట్రిక్యులేషన్ తర్వాత రామమూర్తి పంతులు గుమసాగా చేరారు. బడిపంతులైతే కాస్త మెరుగైన జీతం వస్తుందని భావించిన ఆయన రూ.ఐదు అదనపు జీతం కోసం పర్లాకిమిడిలో ఉపాధ్యాయునిగా చేరారు. ఆ నిర్ణయం ఒక విధంగా ఆయన జీవితాన్నే మార్చేసిందని చెప్పొచ్చు. కొండ కోనల్లోని గిరిజనుల భాష ఆయనను బాగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగానే ఆయనకు సవర భాషతో పరిచయం ఏర్పడింది. 1905లో సవరల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయించారాయన. దీని కోసం తన సొంత డబ్బును ఖర్చు చేశారు. తెలుగు, సవర భాష నిఘంటువులు రచించారు. 1930లో సవర భాషకు వర్ణనాత్మక వ్యాకరణాన్ని రాశారు. తన 16వ ఏటనే అన్నపూర్ణతో గిడుగు వారికి వివాహమైంది. ఎఫ్ఏ ఉత్తీర్ణుడైన తర్వాత హైస్కూల్ ఉపాధ్యాయునిగా మారారు. ఆ తర్వాత చరిత్రలో బీఏ పట్టభద్రులయ్యారు. రాజా వారి కళాశాలలో చరిత్ర పాఠాలను బోధించే అవకాశం వచ్చింది.

వ్యవహారిక భాష కోసం

గ్రాంథికం కాకుండా మనం మాట్లాడుకునే భాషే వ్యవహారిక భాషగా ఉండాలని గిడుగు రామమూర్తి పంతులు పట్టుబట్టారు. తొలుత గురజాడ, ఏట్స్ దొర, శ్రీనివాస అయ్యంగార్ లాంటి వాళ్లతో కలిసి పనిచేశారు. గురజాడ మరణించిన తర్వాత రెండు దశాబ్దాలకు పైగా ఒంటరి పోరాటం చేశారు. ఆ రోజుల్లో ఆయన కుమారుడు సీతాపతి అండగా నిలిచారు. వ్యవహారిక భాషలోనే గ్రంథ రచన, బోధనా భాష ఉండాలని ఉద్యమరీతిలో ముందుకు సాగారు. ఈ క్రమంలో రాజమండ్రిలోని ఓ సభలో గ్రాంథిక వాదులు బాగా గొడవ చేశారట. 'మీరెంతగా గోల చేసినా నేను చెప్పదలచుకున్నది చెబుతా'నని కరాఖండిగా చెప్పారట.


ఒకప్పుడు గిడుగు ఇల్లు ఉన్న ప్రదేశం ఇదే

ఒడిశాలో కలిపినందుకు నిరసనగా...

పర్లాకిమిడి రాజాతో గిడుగు వారికి సత్సంబంధాలు ఉండేవి. కొత్తగా ఏర్పడిన ఒడిశా రాష్ట్రంలో పర్లాకిమిడి తో పాటు మరో 100 గ్రామాలను విలీనం చేయాలన్న రాజా చర్యలను రామమూర్తి పంతులు తీవ్రంగా వ్యతిరేకించారు. న్యాయపరంగా కూడా పర్లాకిమిడి రాజాతో పోరాడారు. కానీ పర్లాకిమిడిని ఒడిశాలో కలపకుండా ఆపలేకపోయారు. మహేంద్రతనయ ఇవతల ఉన్న గ్రామాలను ఒడిశాలో కలవకుండా కాపాడగలిగారు. అంతవరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రెండో పౌరులుగా ఉన్న ఆంధ్రులు.. ఒడిశాలోనూ ద్వితీయ స్థాయి పౌరులుగానే ఉండాలా అన్నదే ఆయన బాధ. పర్లాకిమిడిని ఒడిశాలో కలిసిన రోజున ఆయన నదిలో తర్పణాలు విడిచి.. పరాయి రాష్ట్రంలో ఉన్న ఆ ప్రాంతంలో ఉండలేనంటూ రాజమండ్రికి వెళ్లిపోయారు.

చివరి రోజుల్లో..

గిడుగు 1936 ఏప్రిల్ 1న పర్లాకిమిడిని విడిచి రాజమండ్రికి చేరుకున్నారు. చివరి రోజులన్నీ అచ్చ తెలుగు ప్రాంతంలోనే గడిచాయి. గిడుగుకు ఆ సమయంలో వినికిడి సమస్య వెంటాడింది. అలాగని ఆయనతో సాహితీ చర్చలు ఆపడం మిత్రులకు ఇష్టం ఉండేది కాదు. తన కోసం వచ్చిన వారికి పలక, బలపం ఇచ్చి రాయమనేవారు. అవి చదివి సమాధానం ఇచ్చేవారాయన.

గిడుగు సేవలకు గౌరవంగా..

పర్లాకిమిడిని విడిచినా గిడుగు వ్యవహారిక భాషోద్యమాన్ని మాత్రం వీడలేదు. ఆరోగ్యం సరిగా లేని కారణంగా ఆయనను చెన్నై తీసుకువెళ్లారు. అక్కడే ఆయన 1940 జనవరి 22న కుమారుడు సీతాపతి ఇంట్లో కన్నుమూశారు. సవరులకు గిడుగు చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి 1934లో కైజర్ ఇ హిందు బంగారు పతకంతో సత్కరించింది. సవర భాషకు గిడుగు చేసిన కృషిని మెచ్చి మద్రాసు ప్రభుత్వం 1913లో రావు సాహెబ్ బహదూర్ బిరుదుతో గౌరవించింది. పర్లాకిమిడి హైస్కూల్‌లో చరిత్ర పాఠాలు చెప్పే రోజుల్లోనే శ్రీముఖలింగం దేవాలయంలో చారిత్రక శాసనాల లిపిని ఆయన స్వతంత్రంగా నేర్చుకొని అధ్యయనం చేశారు. గంగ వంశీయుల గురించి ఇంగ్లీషులో ఆయన రాసిన ప్రామాణిక వ్యాసాలు మద్రాస్ లిటరేచర్ జర్నల్ ప్రచురించింది. 30 ఏళ్ల సర్వీసు పూర్తికాగానే అధ్యాపక వృత్తి నుంచి 1911లో ఆయన స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. 1919లో గిడుగు తెలుగు అనే మాస పత్రికను స్థాపించారు. 1938లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు కళాప్రపూర్ణ బిరుదుతో గౌరవించింది. తెలుగు భాష వెలుగు కోసం కృషి చేసిన గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతి రోజైన ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోంది.



శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన గిడుగు విగ్రహం

కనుమరుగవుతున్న జ్ఞాపకాలు

గిడుగు రామమూర్తి పంతులు స్వగ్రామమైన పర్వతాలపేటలో ఆయన జ్ఞాపకాలన్నీ కనుమరుగవుతున్నాయి. దీనిపై భాషాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన మునిమనుమడు గిడుగు రవి ప్రస్తుతం కుటుంబంతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. పర్వతాలపేటలో గిడుగుకు గతంలో జిల్లా జర్నలిస్టులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పంతులు భూములు కాలక్రమేణా ఆక్రమణకు గురయ్యాయి. పర్వతాలపేట గ్రామంలో గిడుగు రామ్మూర్తి పంతులు ఇల్లు శిథిలావస్థకు చేరడంతో వైసీపీ ప్రభుత్వం ఆ స్థలాన్ని కొంతమేర గృహ లబ్ధిదారులకు కేటాయించింది. మిగిలిన కొంత స్థలాన్ని కూడా ఇటీవల కొంతమంది వ్యక్తులు విక్రయించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి.. గిడుగు జ్ఞాపకాలను కాపాడేందుకు ప్రయత్నించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం మండలం, మున్సిపాల్టీ పరిధిలో గల వివిధ గ్రామాలు, వార్డులలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బెల్లుపడ, బెల్లుపడ కాలనీ, కంచ్రవీధి, గొల్లవీధి, వీకేపేట, రత్తకన్న, దాసన్నపేట, కస్పావీధి, డబ్బూరివీధి, పురుషోత్తపురం, ఏఎస్‌పేట వార్డులతో పాటు మండపల్లి, కేదారిపురం, ముచ్చింద్ర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

ఎచ్చెర్లలో...

ఎచ్చెర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కొయ్యాం, కేకే నాయుడు పేట ఫీడర్ పరిధిలో శుక్రవారం ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.యోగీశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొయ్యాం, కేకేనాయుడుపేట, వీరాయవలస తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

రేపు జాబ్ మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సుస్వదీప్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఈ నెల 30న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఉపాధి కల్పనాధికారి కె.సుధ తెలిపారు. శ్రీకాకుళంలోని నెహ్రూ యువ కేంద్రంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13వేల నుంచి రూ.20వేల వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలు, బయోడేటాతో హాజరు కావాలని సూచించారు.

బుడుమూరు మండలం ఏర్పాటుకు సహకరించండి

లావేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బుడుమూరు మండలం ఏర్పాటుకు అందరూ సహకరించాలని గురువారం మండల సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావులను కలిసి వినతిపత్రం అందజేశారు. పరిసర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కలిసి మండలం ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

టూరిజం అభివృద్ధికి స్థల పరిశీలన

ఎచ్చెర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం సముద్రతీరంలో కోస్టల్ జోన్ అభివృద్ధికి పర్యాటక శాఖకు కేటాయించిన 5 ఎకరాల స్థలాన్ని ఆర్డీవో కె.సాయిప్రత్యూష గురువారం పరిశీలించారు. శ్రీకాకుళం నగరానికి సమీపంలో ఉన్న ఈ సముద్రతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.గోపాల్, ఏవో వి.రాజేశ్వరరావు, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. పీజీలో కనీసం 55శాతం మార్కులు, యూజీసీ నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారు ఈ నెల 30న ఉదయం 10 గంటలకు వారి సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ఉత్సవాలలో నిబంధనలు పాటించండి

గార రూరల్/గార, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ గంగరాజు సూచించారు. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆయన గురువారం పరిశీలించారు. డీజేలు ఏర్పాటు చేయవద్దని, ముగింపు రోజున అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఇదిలా ఉండగా గార, బూరవెల్లి, శాలిహుండాం, వమరవెల్లి, కళింగపట్నం తదితర గ్రామాల్లో గణపతి విగ్రహాలను భారీ స్థాయిలో ఊరేగించారు.

మహిళల ఆనందమే సీఎం ధ్యేయం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రణస్థలం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆనందంగా ఉండడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్త్రీశక్తి పథకం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి గురువారం మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభి వృద్ధితోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళల ఆర్థిక స్వాలంబన కోసం కూటమి ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. ప్రధాన మంత్రి నేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ఆడపడుచుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు చౌదరి అవినాష్, లంక శ్యామలరావు, ముప్పుడి సురేష్, ముప్పుడి సుజాత, కొమరాపు రవి, బెండు మల్లేశ్వరరావు, పిషిని జగన్నాథం నాయుడు, లంక ప్రభ, వడ్డాది శ్రీను, రౌతు శ్రీను, జి.రాము, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బంటుపల్లిలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు వీఎన్‌పురం గ్రామంలో వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా



బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస/బూర్జ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబానికీ టీడీపీ అండగా నిలుస్తుందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం శ్రీకాకుళంలోని తన స్వగృహం వద్ద బూర్జ మండలానికి చెందిన బొడ్డు యశోద కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ చిన్న కురింపేట గ్రామానికి చెందిన బొడ్డు లక్షుం ప్రమాదవశాత్తూ మరణించడంతో పార్టీ అతని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించిందని తెలిపారు.

సీఎం సహాయనిధి పంపిణీ



సాయి రోహిత్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న విప్ అశోక్

సోంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన పొట్నూరు సాయి రోహిత్‌కు ప్రభుత్వం అండగా నిలిచింది. సాయిరోహిత్ వైద్య ఖర్చుల నిమత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.8లక్షల చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ రామయ్యపుట్టుగలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ వైశ్య సంఘం, తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ సాయి రోహిత్ కుటుంబానికి బాసటగా నిలిచి చెక్కు మంజూరుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరాడ చంద్రమోహన్, మద్దు కుమార్, చిత్రాడ శేఖర్, బెల్లాన శ్రీకాంత్, బీన ఆనంద్, సానా షణ్ముఖరావు, మల్లా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సింగుపురంలో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల సింగుపురం గ్రామంలో గురువారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించారు. వాహన తనిఖీలను నిర్వహించారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహ నాలను స్వాధీనం చేసుకున్నారు. జామి గోవిందరాజు కిరాణా షాపు, బరాటం శ్రీనివాసరావుల నుంచి 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్ర మంలో రూరల్ ఎస్ఐ రాము, పాల్గొన్నారు.

తగ్గుతున్న ఆదాయం!

(ఐదో పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ల సమయంలో అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ఆ స్థలం వద్దకు వెళ్లి అధికారులు పరిశీలించాలి. కానీ అలా చేయడం లేదన్న విమర్శ ఉంది. దళారులు ప్రవేశం చేసి పని కానిచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్ని కార్యాలయాల్లో సాయంత్రం 6 దాటితే కొన్నిరకాల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డాక్యుమెంట్ రైటర్లు, అనధికార వ్యక్తులదే హవా. సిబ్బందిలా వ్యవహరిస్తూ.. క్రయవిక్రయదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతూ రిజిస్ట్రేషన్లు చేయిస్తుంటారు. తనిఖీల సమయంలో వీరు జాగ్రత్త పడడం, తరువాత పరిస్థితి షరామామూలుగానే కొనసాగుతోంది. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్‌శాఖలో అక్రమాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

● ఈ విషయమై జిల్లా రిజిస్ట్రార్ నాగలక్ష్మి వద్ద ప్రస్తావించగా.. 'జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై ప్రత్యేక నిఘా ఉంది. అవతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవు. అనధికార వ్యక్తుల ప్రవేశం నిషేధం. కార్యాలయాల్లో క్రయవిక్రయదారులు, సాక్షులు మాత్రమే ఉండాలి. కార్యకలాపాలపై దృష్టి పెడతామ'ని తెలిపారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



వీధుల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరంలోని లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలు జలమయమయ్యాయి. డీసీసీబీ కాలనీ, ఇందిరానగర్, మాధవ మోటార్స్, విశాఖ-బి కాలనీలు, రామలక్ష్మణ జంక్షన్ ప్రాంతాలను ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రమంత్రులు, కలెక్టర్‌కు పరిస్థితులను వివరించి, శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని, వాహనదారులకు, స్థానికులకు ఉపశమనం కలిగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పేదల కోసమే...

పేదల కోసమే సీఎం సహాయనిధి అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన 8 నిరుపేద కుటుంబాలకు స్థానిక విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో బుధవారం సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందశారు. వీరిలో వి.శ్రీనివాస్ రూ.1,02,143 ఎం.మహేష్ రూ.62,470, జగిలంకి హరిశంకర్ వరప్రసాద్ రూ.62,557, గండి సీతారత్నం రూ.35,800, ఉంగటి వీరప్పడు రూ.23,500, బమ్మిడి రాములమ్మ రూ.55,786, ఎం.రాంబాబు రూ.30,000, యర్రా రమణమ్మ రూ.20,524 చొప్పున అందుకునానరు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, నగర, మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

జి.సిగడాం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్ల పొట్ట కొట్టిందని దుర్గా భవానీ ఆటో యూనియన్ నాయకులు విమర్శించారు. గురువారం మండల కేంద్రంతో పాటు రాజాం-చీపురుపల్లి ప్రధాన రహదారి సర్వేశుపురం, డీఆర్‌వలస రహదారిపై ఆటో డ్రైవర్లు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఆటోల మీద ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నామని.. ఉచిత బస్సు సౌకర్యంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటో డ్రైవర్ల నిరసనతో ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజాన కృష్ణ, తాలాడ తౌడు, కుప్పిలి అప్పారావు, చందక కూర్మారావు, జనజాన గౌరీశంకరరావు, ఉంగ్రాం నాగేశ్వరరావు, ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమె చూపు సజీవం

అరసవల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిత్తరంజన్ వీధికి చెందిన బరాటం సావిత్రమ్మ(85) గురువారం మరణించారు. కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేయాలని రెడ్‌క్రాస్‌కు సమాచారం అందించారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియన్లు సుజాత, చిన్నికృష్ణ ఆమె కార్నియాలను సేకరించారు. విశాఖపట్నంలో గల ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.

బాల్య వివాహాలతో అనారోగ్యం



మాట్లాడుతున్న హరిబాబు

శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం గ్రామంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్న వయసులో గర్భధారణ వల్ల తల్లీపిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇటువంటి సమస్యలపై న్యాయపరమైన సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబరుకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, సర్పంచ్ ఆదిత్యానాయుడు, రమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకా నీటిలోనే పొలాలు



నదిని తలపిస్తున్న పొలాలు

ఆమదాలవలస, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాగావళి నదీ పరీవాహక ప్రాంత గ్రామాలైన తోటాడ, అక్కివరం, రాగోలు గ్రామాల పరిధిలోని పంట పొలాలు గత నాలుగు రోజులుగా వరదనీటిలో మునిగి ఉన్నాయి. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఈ మూడు గ్రామాలకు చెందిన పంట పొలాలు నీటితో నదిని తలపిస్తున్నాయి. నీటిలో మునిగడం వల్ల వరి పైరు కుళ్లిపోతోందని రైతులు టి.రమణ, టి.బ్రహ్మం, పి.త్రిమూర్తి, వేణు, పి.రమణమూర్తి, వెంకటరావు, ప్రసాద్, మెట్ట వాసు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ మోహన్‌రావును వివరణ కోరగా సమీపంలోని రెండు సాగునీటి కాలువల నీరు పొలాల్లో చేరుతోందన్నారు. నీరు నిల్వ ఉంటే పైరు కుళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు.

ఆక్రమణల పరిశీలన

జలుమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కరవంజ రెవెన్యూలో ఆక్రమణలకు గురైన సాగునీటి కాలువను తహసీల్దారు జె.రామారావు గురువారం పరిశీలించారు. రైతులు చేసిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఆయన తెలిపారు. రికార్డుల ప్రకారం కాలువ ఎంతవరకు ఆక్రమణలకు గురైందనేది గుర్తించి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ కిరణ్, సర్వేయర్ నాగేశ్వరరావు ఉన్నారు.

జీఎం దృష్టికి రైల్వే సమస్యలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజక వర్గ రైల్వే సమస్యలను భువనేశ్వర్‌లోని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తానని జడ్ఆర్‌యూసీసీ మెంబర్ శ్రీనువాస్ రౌళో ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం భువనేశ్వర్ జీఎం కార్యాలయంలో జరగనున్న 11వ జడ్ఆర్‌యూసీసీ సమావేశంలో సమస్యలపై చర్చిస్తానని తెలిపారు. ఇచ్ఛాపురం, జాడుపూడి, కంచిలి, సోంపేట, బారువ, మందస రైల్వే స్టేషన్లలో ప్రధాన రైళ్ల హాల్టింగ్ పై చర్చిస్తానన్నారు. ఆర్ఓబీ, ఆర్‌యూబీలు, ఎఫ్ఓబీ, లిఫ్టుల వంటి సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళతానని వివరించారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

సోంపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పాతరేషన్ కార్డుల స్థానంలో కూటమి ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన స్మార్ట్‌కార్డులను ఎకువూరు, సిరిమామిడి, ఎర్ర ముక్కాం తదితర గ్రామాల్లో గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.









విద్యుదాఘాతంతో రైతు మృతి


వైకుంఠరావు(ఫైల్)

పలాసరూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పలాస మండలం గోపాలపురం గ్రామానికి చెందిన రైతు యవ్వారి వైకుంఠరావు(62) విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైకుంఠరావు పొలంలో నీటిని పరిశీలించేందుకు గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో వెళ్లాడు. ఈ క్రమంలో మోటారు షెడ్ వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పొలానికి వెళ్లిన తన భర్త ఎంతకీ రాకపోవడంతో భార్య ఉషారాణి, బంధువులతో కలిసి పొలానికి చేరుకొని చూడగా వైకుంఠరావు విద్యుత్‌షాక్‌కు గురై పడి ఉన్నాడు. వెంటనే వారు పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించ గా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వైకుంఠరావుకి కుమా రుడు సాయితేజ్, కుమార్తె నవ్య ఉన్నారు. ఏఎస్‌ఐ ఆనందరావు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి..


రాములు (ఫైల్)

కోటబొమ్మాళి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం రైలు నిలయం సమీపంలో గురువారం ఉదయం గుర్తుతెలియని రైలు ఢీకొని సరియా బొడ్డపాడు గ్రామానికి చెందిన చాప రాములు(55) మృతి చెందినట్టు పలాస జీఆర్పీ హెచ్‌సీ మెట్ట సోమేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రితో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులు అప్పజెప్పినట్టు జీఆర్పీ హెచ్‌సీ ఎలిపారు. కాగా రాములుకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జైలు

కొత్తూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నివగాం వద్ద రైసుమిల్లులో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి రాగోలు బాలకృష్ణకి కొత్తూరు కోర్టు న్యాయాధికారి కందికట్ల రాణి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్టు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. 2020 సంవత్సంలో నివగాంలోని ఓ రైసుమిల్లు తాళాలు విరగొట్టి రూ.20వేలు అపహరించుకుపోయాడు. దీనిపై అప్పటి దోనుబాయి ఎస్‌ఐ ఎండీ అమీరు ఆలీ కేసు నమోదు చేయగా, హిరమండలం ఎస్‌ఐ కూన గోవిందరావుతో కలిసి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించినట్టు ఎస్‌ఐ అమీర్ ఆలీ తెలిపారు. పీపీ ఎల్.నాగభేషణరావు కేసును వాదించినట్టు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

హిరమండలం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం హిరమండలంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఒక వ్యక్తి నుంచి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ఎండీ యాసిన్ చెప్పారు. గురువారం మద్యం సీసాలు పట్టుకొని వెళ్తుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

తూనికలు, కొలతలు అధికారుల తనిఖీ



కేసు నమోదు చేస్తున్న దృశ్యం

నరసన్నపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో పలు రైస్, కిరాణా దుకాణాలపై తూనికల కొలతలు శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈనెల 26న 'కల్తీ.. తూకంలో దగా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం పై ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ చిన్నమ్మి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రైస్ దుకాణాలు, కిరాణా షాపుల్లో బియ్యం బస్తాలను పరిశీలించారు. బ్రాండెడ్ కంపెనీల బియ్యం మినహా మిగతా కంపెనీల పేరుతో ఉన్న ప్యాకెట్లు 25 కిలోలు ఉన్నట్లు గుర్తించారు. బస్తాపై మాత్రం 26 కిలోల ముద్ర ఉండగా.. తూకం వేయగా 25 కిలోలు ఉన్నట్టు గుర్తించడంతో వ్యాపారిపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. ఈ దాడుల్లో ఆ శాఖ సీఐ ఎ.బాలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

31 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

● వీరిలో శ్రీకాకుళం జిల్లావాసి


పట్టుబడిన నిందితులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలంలోని కుజభంగి జంక్షన్ సమీపంలో 31 కిలోల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ జె.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి ముంచంగిపుట్టు మండలం మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం కుజభంగి జంక్షన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 31 కిలోల గంజాయి బయటపడింది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పనస గణేశ్, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం నందివలస గ్రామానికి చెందిన తాంగుల బుద్ధు, డుంబ్రిగుడ మండలం సరియా గ్రామానికి చెందిన కొర్ర నందకుమార్‌గా గుర్తించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా బిమరామ్ గ్రామానికి చెందిన కిముడు డబా పరారయ్యాడు. గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి విశాఖ తీసుకెళుతున్నట్టు నిందితులు చెప్పారని, కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ చెప్పారు. కాగా నిందితులపై గతంలో పలు గంజాయి కేసులు ఉన్నట్టు ఆయన తెలిపారు.

కజకిస్తాన్ కబడ్డీ సమాఖ్య గౌరవాధ్యక్షుడిగా ఏరోస్పేస్ శాస్త్రవేత్త


జీవన్‌రావు

మెళియాపుట్టి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంజరు గ్రామానికి చెందిన ఏరోస్పేస్ శాస్త్రవేత్త హనుమంతు జీవన్‌రావు కజకిస్తాన్ కబడ్డీ సమాఖ్య గౌరవాధ్యక్షుడిగా నియమితులయ్యారు. కజకిస్తాన్ రాజధాని అస్తానాలోని నజరబయేవ్ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధక శాస్త్రవేత్తగా జీవన్‌రావు కొన్నిఏళ్లుగా పనిచేస్తున్నారు. గురువారం కజకిస్తాన్ సమాఖ్య రిపబ్లికన్ పబ్లిక్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జీవనరావు తెలిపారు. భారత్-కజకిస్తాన్ దేశాల మధ్య సాంస్కృతిక, క్రీడా సంబంధాలు మెరుగుపరచడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. జీవన్‌రావు ఎంపికపై విద్యావేత్తలు జేజేఎస్ ప్రతాప్, తదిరుతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మృతుడి వివరాలు లభ్యం

కొత్తవలస, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా, కొత్తవలస మండలం కొత్తసుంకరపాలెం సమీపంలోని కోనేరులో పడి మృతిచెందిన వ్యక్తి వివరాలు లభ్యమైనట్టు సీఐ షన్ముఖరావు గురువారం తెలిపారు. ఈనెల 26న కొత్తసుంకరపాలెం కోనేరులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే. మృతుడు శ్రీకాకుళం జిల్లా, జి.సిగడాం మండలం పున్నాం గ్రామానికి చెందిన అలుగోలు తవుడు(48)గా కుటుంబ సభ్యులు గురువారం గుర్తించారు. తవుడు భార్య సత్యమణి, కుమారులు భార్గవ కృష్ణ, సురేష్‌కుమార్ ఇక్కడకు వచ్చి, మృతదేహాన్ని చూసి గుర్తుపట్టారు. తవుడు కొత్తవలస పంచాయతీ డ్రైవర్స్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ కార్పెంటర్ పని చేసుకుంటున్నాడు. తవుడుకు మద్యం అలవాటు ఉందని భార్య తెలిపింది. అయితే ఈనెల 24న ఆయన మరో ఇద్దరితో కలిసి ఆటోలో వెళ్లి మద్యం తాగారు. వారు చెరువులో కలువ పువ్వులు కోసి అమ్మాలని భావించి, కోనేరులోకి దిగారు. అయితే తవుడుకు ఈత రాకపోవడంతో మునిగిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

అర్హులందరికీ పింఛన్ అందిస్తాం

● మంత్రి అచ్చెన్నాయుడు


అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్ అందిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. తమ పింఛన్లను పునః పరిశీలన పేరుతో తొలగిస్తున్నారని పలువురు దివ్యాంగులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అనర్హులైన వైసీపీ నాయకులు తమ కుటుంబ సభ్యులకు దివ్యాంగ పింఛన్లు ఇప్పించుకున్నారని, పునఃపరిశీలనలో అటువంటి అనర్హులను మాత్రమే తొలగిస్తామని, అర్హులైన వారెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, నాలుగు మండలాల ముఖ్య నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. అలాగే స్థానిక టీడీపీ కార్యాలయంలో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి అచ్చెనాయుడు అందజేశారు. మొత్తం 110 మందికి రూ.1.50 కోట్లు అందజేసినట్టు మంత్రి తెలిపారు. అలాగే నిమ్మాడ గ్రామంలో గురువారం వ్యవసాయాధికారులు నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. డ్రోన్ సాయంతో వరి పంటకు నానో యూరియా, డీఏపీ మందు పిచికారీని పరిలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహన్, కోటబొమ్మాళి, టెక్కలి వ్యవసాయాధికారులు ఎస్.గోవింధరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీశక్తి' విస్తృతం చేసేందుకు స్మార్ట్‌కార్డులు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకాన్ని మరింత విస్తృతం చేసేందుకు స్మార్ట్‌కార్డులు ఉపయోగపడనున్నాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం చినబాడంలలో క్యూఆర్ స్మార్ట్ కార్డుల పంపిణీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంతో మహిళలంతా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రాకపోకలు సాగించే సదుపాయం కలిగిందన్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు స్మార్ట్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదిరి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, నాయకులు గాలి కృష్ణారావు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్‌రావు, రామానందస్వామి, మోహన్‌రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. వచ్చే సంక్రాతిలోపు పనులు పూర్తి చేసి పేదలకు అన్న క్యాంటీన్ అందుబాటులో వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చడం చూడలేని వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, పొందరి కూరాకుల సంఘ రాష్ట్ర చైర్మన్ డి.నర్సింహులు, నాయకులు గొద్దు చిట్టిబాబు, శిమ్మ చంద్రశేఖర్, బెవర రాము, అడపా చంద్రశేఖర్, ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గురువారం నిర్వహించిన ఉర్లాం పీహెచ్‌సీ సలహా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంతలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో స్వప్నిల్ జగన్నాథ్

కొత్తూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు సంతలను సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీవో స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. గురువారం మెట్టూరు బిట్-3లో రూ.15లక్షలతో కొత్తగా నిర్మాణం చేసిన సంత షెడ్‌లను పీవో ప్రారంభించి మాట్లాడారు. వంశధార నిర్వాసిత గ్రామాలతో పాటు గిరిజన ప్రాంతంలో సుమారు 52 గ్రామాల రైతులకు ఈ సంత ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. సంత ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు పడాల భూదేవి, సర్పంచ్ కియిలాపు శ్రీనివాసరావులను అభినందించారు. నాబార్డు డీజీఎం మురారి మోహన్ బెహరా, ఎంపీడీవో వి.నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన


ఆకట్టుకునేలా విద్యార్థుల ప్రదర్శన

నరసన్నపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు వన్నె తెచ్చిన గిడుగు రామమూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని స్థానిక శ్రీజ్ఞానజ్యోతి, సత్యవరం ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. అక్షరమాలలో కూర్చొని గిడుగు రామమూర్తి పంతులు వ్యవహారిక భాషకు చేసిన కృషిని వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చినదోకులపిడు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడికి వాహనం ఢీకొట్టి ప్రమాదానికి గురికావడంతో విషయం తెలుసుకున్న ఉద్దాన హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు. తలకు బలమైన గాయం కావడంతో రక్తం కోసం దాతలు సహకారం కోరగా హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు స్పందించి రక్తం అందించేకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు కీలు విజయ్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

పాతపట్నం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పాతపట్నం కోర్టు ఇన్‌చార్జి, నరసన్నపేట జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్.వాణి అన్నారు. కాగువాడలో గల మహాత్మా జోతీవారు పూలే బాలిలక గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గురుకుల ప్రిన్సిపాల్ గణపతి శ్రీరాములు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బి.లావణ్య, న్యాయవాదులు మద్దు రమణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కాశీబుగ్గ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని పలాస బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఫియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం కాశీబుగ్గ ఓ ప్రైవేట్ కళాశాలలో మండల న్యాయ సేవ సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి తిరుములరావు, న్యాయవాదులు దేవరాజు, లోకేశ్వరరావు, అంది రామకృష్ణ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

జలుమూరు (సారవకోట), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించి పిల్లలకు క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించాలని జిల్లా పరిశీలకులు, డైట్ అధ్యాపకులు తాడేల వెంకటరావు అన్నారు. వడ్డినవలస, అలుదు ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అలుదు ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎంఈవో ఎంపీ రమణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపాల అలంకరణతో ప్రత్యేక పూజలు



పలాస రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో భగవాన్ సత్య సాయిబాబా శతవర్ష జయంతి వేడుకల సందర్భంగా గురువారం వంద దీపాలతో గణేష విగ్రహానికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. బాబా శతజయంతి సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసినట్లు ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యక్షులు తాళాసు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, వార్డెన్ మౌనిక, అనిత, లావణ్య కృష్ణ, జోకి జగదీష్, పి.కొండలరావు పాల్గొన్నారు.

తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలి

మందస, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ప్రాధాన్యం, మాతృభాష ఆవశ్యకతను తెలియజేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజావిజ్ఞాన వేదిక కన్వీనరు మార్పు జగన్మోహనరావు అన్నారు. మందస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ప్రజావిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు జి.రమణమూర్తి తెలుగు పద్యాల ఆవశ్యకతను, భాష తియ్యదనంపై వివరించారు. ప్రజావిజ్ఞానవేదిక కన్వీనరు మార్పు జగన్మోహనరావు, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ప్రసాద్,దాసరి ఈశ్వరరావులు పాల్గొన్నారు.

విద్యుత్తు ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

అరసవల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్తు అమరవీరుల ప్రతిజ్ఞా దినం సందర్భంగా నగరంలోని అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు.

● నరసన్నపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై ట్రూఆప్ చార్జీలు పేరుతో భారాలు వేస్తే ప్రజాసంఘాలు ఐక్యంగా ప్రతిఘటించడం జరగుతుందని వామపక్షాల జిల్లా కార్యవర్గసభ్యులు గంగరాపు సింహాచలం, కొన్నశ్రీనివాసరావులు అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రతిజ్ఞ దినం నిర్వహించారు.

● కాశీబుగ్గ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు మోయలేని విధంగా విద్యుత్ బారాలు పెంచుతున్నారని వామపక్ష నాయకులు గణపతి, సన్యాసిరావు, రవి, వినోద్, అజయ్‌కుమార్, రామారావు అన్నారు. గురువారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రతిజ్ఞ చేసి నిరసన తెలిపారు.

● హరిపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు భారంపై ప్రజలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు పి.దేవేంద్ర పిలుపునిచ్చారు. మందస మండలం రాధాక్రిష్ణపురంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● పోలాకి ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరులకు స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా గురువారం పోలాకి మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు రంగారావు, సింహాచలం, గన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే వరి పంట


పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్లతో తంపర పంట భూములు వరద నీటిలోనే ఉన్నాయి. ఈ నెల 17వ తేదీ నుంచి కురిసిన భారీ వర్షాలకు చిక్కావలస, సుందరాపురం, మామిడివలస, కంబకాయి, బసివలస, పారశెల్లి, రెల్లివలస తదితర గ్రామాల తంపర భూములు ఈనెల 20న వరద నీరు ముంచెత్తింది. అలాగే ఈదులవలస- రావులవలస గ్రామాల మధ్య భూముల్లో వరదనీరు చేరింది. దీంతో వరిపొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

● జలుమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పాగోడు, వెలుసోద, గుగ్గిలి, కూర్మనాథపురం, రామయ్యవలస తంపర పొలాలు నీట మునిగాయి. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. పాగోడు వద్ద సింగినాదం కాలువ పొంగి ప్రవహిస్తుంది.


చిక్కాలవలస-సుందరాపురం వద్ద వరదనీటిలో వరిపైరు


వెలుసోద తంపర పొలాల్లో చేరిన వరద నీరు

ప్రమాదకరంగా రావివలస పెద్ద చెరువు

టెక్కలి రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా కురిసిన వర్షాలకు రావివలస పెద్ద చెరువు గట్టు కూరుకుపోవడంతో గండి పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామం నుంచి ఎండల మల్లికార్జున ఆలయం వరకు చెరువు గట్టు మీదుగా సీసీ రోడ్డు వేశారు. ఇప్పుడీ వర్షాలకు రోడ్డు కోతకు గురై గండి పడే పరిస్థితికి చేరుకుంది. దీంతో గురువారం మండల ఇంజనీరింగ్ సిబ్బంది పరిశీలించి ప్రత్యేమ్నాయ ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మీదుగా వాహనల రాకపోకలు నిలిపివేసినట్టు కార్యదర్శి రవి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


బోల్తా పడిన ఆటో

రణస్థలం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. దన్నానపేట సమీపంలో జరిగిన ప్రమాదంలో లావేరు మండలం కొత్తకుంకాం గ్రామానికి చెందిన బి.శిరీష (22) మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు జేఆర్‌పురం వేంకటేశ్వర కాలనీలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి ఆటోలో శిరీష వెళుతోంది. దన్నానపేట వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీంతో శిరీష అక్కడికక్కడే మృతి చెందింది. ఇదిలా ఉండగా మరో ప్రమాదంలో లావేరు మండలం సుభద్రాపురం గ్రామానికి చెందిన వి.ప్రభాస్ (20) మృతి చెందాడు. జేఆర్‌పు రం నుంచి సీతంవలస మీదుగా ద్విచక్ర వాహనంపై వి.ప్రభాస్, రాంబాబు వెళుతున్నారు. సీతంవలస గ్రామానికి సమీపంలో వీరి వాహనం అదుపు తప్పింది. దీంతో కిందపడిన ప్రభాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాంబాబుకు గాయాలయ్యాయి. ఈ రెండు సంఘటనలకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్ చిరంజీవి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

జలుమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జలుమూరు గ్రామానికి చెందిన పులి వెంకటరావు (37) గడ్డిమందు తాగి శ్రీకాకుళం రిమ్స్ లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్యానికి బానిసైన వెంకటరావు అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురై ఈ నెల 9న గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. తండ్రి శివరాం ఎనిమిదేళ్ల కిందట మృతిచెందగా తల్లి సావిత్రి ఉంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

కూలిన పూరిల్లు

పాతపట్నం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కె.గోపాలపురం గ్రామంలో రేగేటి వజ్రమ్మకి చెందిన పూరిల్లు బుధవారం కూలిపోయింది. దీంతో ఆమె నిరాశ్రయురాలయ్యింది. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చా మని, పరిశీలించి ఆమెను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు మునిసిపల్ సమావేశం

పలాస, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పలస-కాశీబుగ్గ మునిసిపల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి జరుగుతుందని చైర్మన్ బళ్ల గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులు, అధికారులంతా సమయానికి హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

కోర్టుకు హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కొత్తూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి గురువారం కొత్తూరు కోర్టుకు హాజరయ్యారు. గత వైసీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వ భవనాలపై పార్టీ రంగులు వేయకూడదని అడ్డుకున్నందుకు కలమతోపాటు 14మంది టీడీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసింది. దీంతో అప్పటి నుంచి కోర్టు వాయిదాలకు వెళ్తున్నారు.

జీవిత బీమా చేయించాలి

ఎల్ఎన్ పేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి వేతనదారుల (60 ఏళ్లలోపు వయసు కలిగిన)తో ఈశ్రమ్ ద్వారా జీవిత బీమా చేయించాలని ఏపీవో శ్రీదేవి తెలిపారు. గురువారం ఫీల్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసీ కె. సింహాద్రి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కమిషనర్ పరిశీలన

కాశీబుగ్గ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్ పనితీరు, అలాగే శానిటేషన్ నిర్వహణ ఫుడ్ క్వాలిటీ సకాలంలో అందజేడం వంటి విషయములపై ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌లో 80శాతంపైగా బాగున్నట్టు రిపోర్టులు వచ్చాయని కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. గురువారం కాశీబుగ్గ అన్న క్యాంటీన్, శానిటేషన్ సిబ్బంది పనితీరును పరిశీలించారు.

శ్రీకాకుళం డివిజన్‌లోకి మార్చాలి

ఎల్ఎన్ పేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎల్ఎన్ పేట మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్ నుంచి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు మార్పు చేయాలని దళిత సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజారావు, కె.తవుడు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్, ఇన్‌చార్జి ఎంపీడీవో జె.ఈశ్వరమ్మ, పి.శ్రీనివాసు లను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. మండలం టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నందున ఇక్కడ నుంచి రాకపోకలు చేసేందుకు ఎటువంటి రవాణా సదుపాయం లేకపోవడంతో ప్రజలంతా ఇబ్బందిపడుతున్నారన్నారు. దళిత మహాసభ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామశంకరరావు, కోశాధికారి ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జలుమూరు(సారవకోట), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ సతీష్‌కుమార్ హెచ్చరించారు. అలుదు, సారవకోటలోని ఎరువుల షాపులను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డుల్లో నమోదుచేసిన ఎరువుల వివరాలు పరిశీలించారు. ఏవో సీహెచ్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాటపై నిలబడిన ప్రభుత్వం

కాశీబుగ్గ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మాటపై కూటమి ప్రభుత్వం నిలబడిందని సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. గురువారం కాశీబుగ్గ 17వ వార్డు తిలక్‌నగర్‌లో క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.